

## డి. కామేశ్వరి

వవ వధువుగా కుడిపాదం యెత్తి గుమ్మంలో కాలుపెట్టిన వసంత ఎదురుగా గోడమీద శాంత లైఫ్ సైజు బస్ట్ ఫోటో చూసి ఆశ్చర్యంతో తెల్లబోయింది.

శాంత! శాంతేనా! మళ్లీ నిశితంగా చూసింది.

శాంతే! వధువుగా నిండు అలంకరణతో ఉండటం మూలాన త్వరగా గుర్తుపట్టలేక పోయింది.

శాంత వదలివెళ్లిన స్థానాన్నా తను పొందింది!?

అయోమయంగా, నివ్వెరపాటుతో చూస్తున్న వసంత, అందరూ తనవంకే చూడడం గమనించి తలదించుకుంది.

చుట్టూ అందరి మొగాలు దుఃఖంతో మ్లానమయ్యాయి. వసంత భర్త శివరాం మొదటి భార్య గుర్తువచ్చి కాబోలు, నల్లబడిన మొహంతో, తల త్రిప్పుకుని గిరుక్కున తిరిగి గదిలోకి వెళ్ళిపోయాడు. మామగారు దీర్ఘంగా నిట్టూర్చి లోపలికి వెళ్ళిపోయారు. అత్తగారు కోడలిని తలుచుకుని కళ్లొత్తుకుంది. మరదులు, ఆడబడుచులు వసంత మొగంలోకి చూసి తలలు దించుకున్నారు.

అందరిమధ్య, ఏం చేయాలో తోచని స్థితిలో క్రొత్తగా, బిడియంగా నలువైపులా చూసి తల దించుకుంది వసంత. తనేదో తప్పు చేసినట్లు అనిపించింది వసంతకి. అందరి ఆ స్థితికి కారణం తనే అన్నట్టు సిగ్గుతో కృంగిపోతున్న వసంతని..... వసంత అక్కయ్య కమల చేయిపట్టుకు గదిలోకి నడిపించుకు వెళ్ళింది.

ఏమిటిది? క్రొత్తగా గుమ్మంలో కాలుమోపిన పెళ్లికూతుర్ని యిదేనా ఆహ్వానించే విధానం? ఎంత రెండో పెళ్ళి అయినా కాస్త ఆదరణ, సంతోషం లేకపోగా యీ ఏడుపులేమిటి? తనేదో నేరం చేసినట్లు చూస్తారేమిటి అందరూ? వసంత హృదయం అవమానంతో కృంగిపోయింది. అసలు పెళ్లయినా అదోలా జరిగింది! ఏ ముద్దుముచ్చట లేనిపెళ్ళి! గుళ్లో దేముడి ఎదుట పుస్తెకట్టి, వెంటనే యిక్కడికి తీసుకువచ్చారు! యింతే తనకి రాసిపెట్టి ఉంది.... వసంత కుమిల సాగింది ఆలోచించిన కొద్దీ.

వసంత మనోభావాలు పసిగట్టి కమల వోదార్పుగా అంది "బాధపడకమ్మ, వసూ! రెండో పెళ్లి అంటే యింతే! మొదటి సారిలాగ ఆడంబరాలు అవీ వుండవు! ఎలాగో సర్దుకోవాలి! మనం అనుకుని లాభంలేదు.! నాలుగు రోజులుపోతే వాళ్లే సర్దుకుంటారు."

వసంత దిగులుగా కళ్ళు తుడుచుకుంది.

వంటావిడ కాఫీ తెచ్చియిచ్చి, వసంత మొహంలోకి గుచ్చి గుచ్చి చూసింది. అన్ని కోణాలనించి పరిశీలించి చూసింది. "ప్చ్... శాంతమ్మ... ..మహాతల్లి... శాంతమ్మపోయాక యీ యింటి కళే పోయింది. చినబాబు మొగంలో ఆనాటినించి నవ్వేలేదు... మళ్లీ ఎప్పటికి మారతాడో చినబాబు." ముసలిది కళ్ళు తుడుచుకుంటూ అంది.

ఎవరెవరో, ఒక్కొక్కళ్లు, పనివాళ్లు సయితం గదిలోకి తొంగి చూస్తున్నారు కుతూహలంగా. ఆ చూపులు ములుకుల్లా గుచ్చుకోసాగాయి [illegible]కి.

బాత్‌రూములోకి బట్టలు పట[illegible] వెడుతున్న వసంతకి నూతిదగ్గర [illegible] వినిపించాయి. "శాంతమ్మగారు [illegible]

జరిగిపోతున్నాయి!.... ఉదయం లేచింది మొదలు అందరూ ఎవరి పనులు వారు ఆమె ఉనికే గుర్తించకుండా చేసుకోవడం వసంతకి బాధ అనిపించింది.

ఎదురుగా ఉన్న మామగారు వసంతని అడగకుండా భార్యనో, కూతుర్నో కాఫీ అడుగుతారు, అత్తగారు స్వయంగానే పూలు కోసుకుంటుంది, ఇంటి విషయాలు, బజారు పనులు చెప్పడం అన్నీ అత్తగారే స్వయంగా చూసుకుంటూంది. ఆడపడుచులు వాళ్ళంతట వాళ్ళు చనువుగా మాట్లాడరు. వసంత ఏదైనా అడిగితే తప్ప మాట్లాడరు. పెద్దమరది అసలు వసంతవున్న ఛాయలకే రాడు. ఆఖరికి చిన్న మరిదికూడ. శాంతచేత నీళ్ళు పోయించుకు, బట్టలు తొడిగించుకునే ఆ మరదికూడ వసంత పిలిచినా సిగ్గుపడి పారిపోతాడు. ఇలాంటి వాతావరణంలో తనంతట తానుగా ఏం చేయాలో కూడ తోచేదికాదు వసంతకి. ఎంతసేపటికి అవసరాక గెస్టుగా చూస్తున్నారు తప్ప, యింటిలో మనిషిగా ఎవరూ గుర్తించకపోవడం వసంతకి అవమానం అనిపించింది. ఎన్నాళ్ళో సహించలేకపోయింది ఆ బాధ. ఒకరోజు శివరాంతో మనసులో బాధ వెళ్ళగ్రక్కింది.

"బావుంది, నీ అంతట నీవు కల్పించుకుని చేయాలిగాని, క్రొత్తగావచ్చిన దానివి, నీతో ఏం చెపుతారు, ఎవరుమాత్రం?" అన్నాడు. భర్తకూడ వాళ్ళనే సమర్థించడంతో కోపం ముంచుకువచ్చింది వసంతకి.

"ఏంచేస్తాను, నా అంతటనేను, వాళ్ళందరూ వెలేసినట్లు దూరంగావుంటే, మాట్లాడినా మాట్లాడకపోతే, ఏం చేయాలో నాకేం తెలుస్తుంది?"

"శాంత చెప్పినే చేసేదా? వచ్చిన మొదటిరోజే యింటి బాధ్యత అంతా చేతిలోకి తీసుకుంది!"

# వి ప రీ యా లు

...యింకేం మాట్లాడుతుంది వసంత.... ఎంత గురి, శాంతంటే!!

మర్నాడు వసంత తనంతటతానుగా చొరవగా ముందుగలేచి కాఫీ కలిపి మామగారికి తీసికెళ్ళియిచ్చింది. ఆయన ఒకసారి కళ్ళెత్తి వసంతవైపు చూసి, మౌనంగా గ్లాసు అందుకున్నారు.... ఆ వెంటనే అత్తగారుని పిలిచి ఏదో చెప్పారు. ఆవిడ కాఫీగ్లాసు వెనక్కితెచ్చి "మీ మామగారికి అంత స్ట్రాంగ్ కాఫీ పడదు, పంచదార కూడ అంత వేసుకోరు, నీకు తెలీదు, నేను కలిపిస్తాలే" అంది. వసంతకి చెంపకొట్టినట్టయింది. ఎంతో శ్రద్ధగా మెప్పుకోసం స్ట్రాంగ్ కాఫీ తీసికెళ్ళియిస్తే యిలా అయిందేమిటి?!...

మళ్ళీ వెంటనే దులిపేసుకుని లేచి ఉత్సాహం తెచ్చుకుని పూలసజ్జ పట్టుకుని పూలుకోసి తీసుకొచ్చింది. కోసితెచ్చిన పూలు చూసి అత్తగారు, "అయ్యో, స్నానం చేయకుండానే పూలన్నీ కోసేసావా?" అదోలా నిష్ఠూరంగా అంది ఆవిడ... శాంత అందరికంటె ముందుగాలేచి స్నానం చేసే మిగతాపనులు చేసేదన్న విషయం గుర్తుకొచ్చింది వసంతకి. అప్పుడు పూలు లేకుండానే అత్తగారు పూజ చేసుకుంటూంటే సిగ్గుతో చితికిపోయింది వసంత. 'అయినా పూలకి కూడ మడేమిటి, మరీను' మనసులోనే కోపంగా అనుకుంది వసంత. నీళ్ళు పోసుకుంటున్న చిన్నమరది దగ్గరకి వెళ్ళి 'నేను పోస్తా రుద్దనా నాన్నా' అంటూ చనువుగా అడిగితే, వాడు సిగ్గుతో మెలికలు తిరిగి, నీళ్ళు పోసుకోకుండానే లోపలికి పరిగెత్తి వెళ్ళిపోయాడు. వసంత వస్తున్న విట్కార్పు అణచుకుంది.

జడ విప్పుకుంటూ అక్కగారిని జడవేయమని అడుగుతున్న చిన్న ఆడపడుచుని జడ వేస్తానంటూ పిలిస్తే, ఆ పిల్ల మొహమాటపడి వద్దు వద్దు అంటున్నా బలవంతంగా వేసింది వసంత..... "అక్కయ్యా, జడ కొంచెం వేయవూ,.. ఆవిడ ఆ క్రొత్త వదిన, చూడు ప్రక్కపాపిటి తీసి నా మొహమే మార్చేసింది, కాయా, మళ్ళీవేయవూ" అంటూ నెమ్మదిగా చెప్పి అక్కగారి చేత మళ్ళీ జడవేయించుకున్న ఆ పిల్లని చూడగానే వసంత మనసు అవమానంతో దహించుకుపోయింది.


ఏమిటి పిల్ల ఉద్దేశం?... ఆ శాంతపాటి పనులు తనకి చేతకావనా?.... ఆ శాంత పాటి తెలివితేటలు తనకి లేవనా? ఎంత తనంతటతానుగా కల్పించుకుని ఏపని చేయబోయినా 'నీకు తెలీదులే,' 'నీకు ఎందుకులే?' 'నేను చేసుకుంటాలే', 'వద్దులే' అనడంతప్ప, తనని ఏ పని చేయనీయకుండా ఏమి చెప్పకుండా, పరాయిదానిలా, వెలేసినట్లు చూడడం వసంతకి భరించడం శక్యంకాని బాధగా తయారయింది.

"ఏంచేసి శాంత అందరి మనసుల్ని యింతగా బంధించింది? ఏంచేసి అందరిని ఆకట్టుకుంది? ఏంచేసి యింత అభిమాన పాత్రురాలైంది. తనలో లేనిది శాంతలో ఏముంది? తనకంటె శాంత ఎందులో ఎక్కువ?... శాంతలో వున్నది తనలో ఏం లేదు? శాంతా!?.... శాంతా, ఎందుకు నన్నిలా చిత్రహింస పెడుతున్నావు? ఎందుకు నన్నిలా అవమానిస్తున్నావు? ఎందుకు నన్నిలా వెలివేసినట్లు అందరి దూరం చేస్తున్నావు? నేను నీకేం చేశాను ...నన్నెందుకు ఇలా దుఃఖపెడుతున్నావు?"

— ఆ రోజు జ్వరంతోవున్న వసంతకి 'నేను ఎవరికీ అక్కర్లేదు, తనని అందరూ నిర్లక్ష్యం చేస్తున్నారు, అప్పటికీ శాంత స్థానాన్ని పొందలేదు' అన్న భావం ఆమెని నిలువునా కాల్చసాగింది. ఆవేశంతో, కోపంతో, ఆ పరిణామాలకి కారణభూతురాలైన శాంతని, చచ్చి కూడా సాధిస్తున్న శాంతని మనసులోనే శపించుకోసాగింది వసంత. ఆ ఆవేశపు క్షణాలలోనే చటుక్కున గుర్తువచ్చింది వసంతకి.

శాంత!... సాధిస్తోంది! చిన్ననాడు చేసిన తన దోషాలకి శిక్షిస్తోంది!..... తన ఆనాటి నిర్దయకి, క్రూరత్వానికి, తన అహంకారానికి శిక్ష వేసింది. శాంత!... అవును, అదే... అదే కావాలి తనకి శాంతవేసిన యీ శిక్ష సరి అయినదే! సౌమ్యురాలు సహృదయురాలైన శాంతని కావాలని హింసించిన, దుఃఖపెట్టిన పాపం వూరికే పోతుందా? అందుకే యిప్పుడనుభవిస్తోంది!—

శాంతని మొదటిసారి ఘన్నుఫారంలో అడుగుపెట్టి చూసిన వసంతకి మొదటి చూపులోనే శాంత అంటే చులకన భావం, నిర్లక్ష్యం ఏర్పడింది. నల్లగా, పొట్టిగా, పీలగా, వెలిసిన పరికిణీ, నలిగిన జాకట్టు, బిడియపడుతున్న మొహం, గట్టిగా ఊలుముక్కపెట్టి వేసిన జడతో కనిపించిన శాంతంటే అదోరకం చులకనభావం కలిగింది. తెల్లగా, బొద్దుగా, ఖరీదయిన ఫేషన్ బుల్ సిల్కు గౌనుతో, రెండు జడలతో, ఖరీదయిన బూటులు, సాక్సులతో, క్లాసుందరికంటె తనలో ఏదో ఆధిక్యత కనిపించి గర్వపడింది వసంత. తండ్రి



పెద్ద ఆఫీసరు. అందం, ధనం, హోదా, తెలివి తేటలు యివన్నీ ఆమెలో మొదటినించి అహంకారానికి తావిచ్చాయి. ఆ అహంకారంతోనే, ఆ గర్వంతోనే వసంత శాంతని హీనంగా చూసింది. క్లాసులో మొదటిరోజు యింకెక్కడా చోటులేక శాంత ప్రక్కన కూర్చున్న వసంతని శాంత ఎంతో ఆసక్తిగా, కుతూహలంగా ఆమెవంకా, ఆమె ఖరీదయిన దుస్తులవంకా చూస్తూ, చనువుగా పేరు అడిగి, స్నేహం కలుపుకోబోతే, నిర్లక్ష్యంగా వసంత జవాబివ్వలేదు. అదేం పట్టించుకోకుండానే శాంత ఆ రోజంతా వసంత వెంట తిరుగుతూ ఏవేవో స్కూలు సంగతులు చెపుతూనే వుంది. క్లాసులో ఆలస్యంగా చేరిన వసంతకి అడగకుండానే, జరిగిన పాఠాల నోట్సులు అవీ యిచ్చి, వూసుకు తిరుగుతున్న శాంతని, తన స్నేహంకోసం ప్రాకులాడే శాంతని చూస్తే వసంతకి మరింత నిర్లక్ష్యం పెరిగింది.

ఆ రోజునించి ఏదోవిధంగా స్నేహం కలపుకోడానికి జేలగా ప్రయత్నించి, వెంట తిరిగే శాంతని చూస్తే వసంతకి మరింత ఏడిపించ బుద్ధివేసి, వెంటబడే శాంతని కసిరికొట్టేది. అయినా కూడ నొచ్చుకునేదిగాదు, విసుక్కునేదిగాదు శాంత. వసంతతో మాట్లాడడమే మహాభాగ్యం అన్నట్లు ఉండేది శాంతకి.

వసంత యింటికి నాలుగిళ్ల అవతల వుండేది శాంతవాళ్లిల్లు. శాంత తండ్రి ప్లీడరు. పెద్ద సంపాదన లేకపోయినా ఏదో గుట్టుగా సంసారం గడుపుకునే మధ్యతరగతి సంసారులు. ఉదయం స్కూలుకి వెళ్లేముందు అరగంట ముందుగా శాంత వసంత కోసం యింటికి వచ్చి కాచుకు కూర్చునేది. అది చూడనట్లుగా కావాలని మరింత ఆలస్యంచేస్తూ, చివరికి శాంతని పిలవకుండానే స్కూలుకి వెళ్లిపోయే వసంత వెంట పరుగెత్తేది శాంత. మళ్లీ సాయంత్రం స్కూలు విడిచిన వెంటనే అంతే. వెంటబడ్డ శాంతని వదిలి ముందుగా పరిగెట్టి వెళ్లిపోయేది వసంత. పాపం శాంత యింటినించి ఏవో ఫలహారాలు చాటుగా పొట్లం కట్టి తెచ్చి ఆప్యాయంగా, వసంతకిస్తే, తినాలని ఉన్నా, 'ఛీ, యిలాంటివి మేం తినం' అంటూ విసిరి పారేసేది వసంత. శాంత ఎంతో చిన్నబుచ్చుకునేది. శాంత ఎదురుగా ఏవేవో తెచ్చుకుని తింటూ ఆశగా చూసే శాంతకి యీయకుండా ఏడిపించేది వసంత. యింట్లోవున్న జామిచెట్టు ఎక్కి, శాంత క్రిందనించి చూస్తుండగా మంచి మంచి కాయలన్నీ కొరికి పారేసేది. ఒకటియ్యమని జాలిగా బతిమిలాడే శాంతకి యిస్తాను యిస్తానంటూనే అన్నికొరికిపారేసి చెట్టుదిగి పోయేది. యింట్లో గ్రామఫోను రికార్డులు వింటూ శాంత వచ్చి ఆశ్చర్యంగా, ఆసక్తిగా చూస్తూంటే ఆపేసేది, శాంత రికార్డులు వేయమని బతిమిలాడినా వినకుండా.

క్లాసులో మాస్టరు ప్రశ్నలకి శాంత జవాబీయలేకపోతే వసంత హేళనగా నవ్వేది. శాంత చూడకుండా పుస్తకాలు తీసి డ్రాయింగుల మీద సిక్కుల మీద యింకు జల్లి, పిచ్చి గీతలు పెట్టి, పేజీలు చింపేసి, శాంత ఏడుస్తూంటే ఏం తెలీనట్లు నవ్వేది. క్లాసు పిల్లలందరూ యించుమించు వసంత పక్షమే. అందరినీ కలిపి కట్టుకట్టి శాంతని ఏడిపించడం, శాంతని వెలివేసినట్లు ఎవరినీ శాంతతో చేరనీయకపోవడం, అందరితో ఏదో శాంతమీద చెపుతూ ఉడికించి ఏడిపించడం అవన్నీ వసంతకి సరదాలు. జాలిగా చూసే శాంత చూపు చూస్తూంటే వసంతలో ఏదో పిశాచి మనస్తత్వం తొంగిచూసి యింకా యింకా ఏడిపించ బుద్ధి వేసేది! ఎంతచేసినా, ఎంత ఏడిపించినా ఒక్కనాడూ కోపగించుకోకుండా, ఎంతో సహృదయంతో, నవ్వుతూ మంచిగా వుండడానికే ప్రయత్నించేది శాంత. కోపమనేదే ఎరగదేమో ననిపించేది. పెద్ద అయ్యాక, పెద్దక్లాసులలోకి వెళ్లాక కాస్త అలాంటి అల్లరి, ఏడిపించడం అవీ తగ్గినా శాంతపట్ల చులకనభావం, నిర్లక్ష్యం అలాగే వుండిపోయేయి వసంతకి. శాంతకూడ వసంతని యింకా అలాగే అభిమానించడమూ మానలేదు.

స్కూలు ఫైనలు అయిన ఆవేసంగిలోనే శాంతకి పెళ్లి కుదిరింది శాంత స్వయంగా శుభలేఖ తీసుకొచ్చి, ఎంతో ఆప్యాయంగా ఆహ్వానిస్తే వసంత చూడనైనా చూడకుండా శుభలేఖ నిర్లక్ష్యంగా పడేసింది. పెళ్లి నాలుగిళ్ల అవతల అవుతున్నా వసంత పెళ్లికి వెళ్లలేదు. 'శాంత నల్లనిదైతేనేం, అదృష్టవంతురాలు, మంచి సంబంధం దొరికింది' అని అందరూ అనుకుంటున్నా వసంత ఏ ఆసక్తి చూపలేదు తెలుసుకోడానికి.

అత్తవారింటికి వెళ్లేముందు తనేవచ్చి, పెళ్లికి రానందుకు ఎంతో నొచ్చుకుంటూ అడిగి, వాళ్ల ఆయనని చూడడానికి రమ్మని పిలిస్తే ముక్తసరిగా జవాబిచ్చింది వసంత. మనసులో, 'యీ అందగత్తెని కాక, యీ అందకత్తె మొగుడి అందం కూడ ప్రత్యేకంగా వెళ్లి చూడాలి గాబోలు' అని అనగా, హేళనగా నవ్వుకుంది వసంత. 'వసంతా నన్ను మరచిపోతావా? గుర్తుంచుకోవూ శాంతని?' ఆప్యాయంగా, అభిమానంగా చేయిపుచ్చుకుని శాంత అంటూంటే మౌనంగా తలూపింది, చేయిలాక్కుని, ఏమనలేక వసంత.

శాంత అత్తవారింటికి వెళ్లిపోయింది.

వసంత కాలేజీలో చేరింది. ఇంటర్ చదువుతూండగానే తండ్రిపోవడం, వసంతా వాళ్లందరూ వాళ్ల మేనమామగారి వూరు చేరడం అన్నీ జరిగేయి. తరువాత పరిస్థితులు మారి, వసంత గర్వం, అహంకారం అన్నీ చచ్చి...... యిలా ఆమె యీ యింట్లో అడుగుపెట్టడం.... మళ్లీ యిన్నాళ్లకి శాంత ఉనికి తెలియడం....."— తల్చుకుంటున్నకొద్దీ వసంతకి, తన చిన్ననాటి ప్రవర్తన శాంతపట్ల ఎంత క్రూరంగా వుందో గుర్తువచ్చి మనసు వికలమవసాగింది.

తను అంత కింత యిప్పుడు అనుభవిస్తోంది. శాంతపడిన క్షోభ తనకిప్పుడు అర్థం అవుతూంది. ఎప్పుడో, ఏదో లోకంలో శిక్ష అనుభవించడం ఎందుకు? ... ఇక్కడే ... యిప్పుడే అనుభవిస్తోంది.. కావలసిందే తనకి యిలా!.....

"శాంతా! ఎప్పటి కక్షో యిలా తీర్చుకుంటున్నావా? చచ్చిపోయి కూడ సాధిస్తున్నావా? అందరిచేత నన్ను వెలేయించి, అందరికీ నన్ను దూరం చేసి, అందరిచేత నిర్లక్ష్యం చేయించి... ప్రతీకారం తీర్చుకుంటున్నావా?....

"తప్పు... తప్పు... శాంతా, నీ గురించి అలా వూహించడం కూడ తప్పే! కక్ష, కోపం, పగ, ..... యీ పదాలే నీలో తావులేదు.....

నా నేరానికి భగవంతుడే శిక్షించాడు నన్ను!"

శాంత సహృదయత, మంచితనంతోనే, ఆమె అందరికి అభిమానురాలై ప్రీతి పాత్రురాలైందని అన్నది వసంత గుర్తించింది.

వసంత అంతరంతరంలో మిగిలిపోయిన అహంకారం అంతా ఆమె కన్నీటిలో కరిగిపోగా పశ్చాత్తాప హృదయంతో శాంత క్షమను అర్థించింది చేతులెత్తి. ●

